

## మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

చేవెళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న బ్యాంకు రుణాలతో మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా పీడీ వెంకట నారాయణ తెలిపారు. బుధవారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో మెప్మాకు సంబంధించిన మహిళా సంఘాల గ్రూప్ సభ్యులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మహిళ సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు అందిస్తుందన్నారు. మహిళా సంఘాలను మెప్మాకి అనుసంధానం చేస్తున్నందున రిసోర్స్ పర్సన్‌లతో చేవెళ్ల మున్సిపాల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపాల్ కమిషనర్ ఎస్. వెంకటేశం, డీఎంసీ ఇందిర ఉన్నారు.



జిల్లాలో ప్రాదేశిక ఎన్నికల సమరానికి రంగం సిద్ధమైంది. బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే ఇవ్వలేదు. ఫలితంగా యథావిధిగా జిల్లాలో తొలి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు నేడు(గురువారం) నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు చేశారు. నోటిఫికేషన్ విడుదల కాగానే తొలివిడత నామినేషన్ల ప్రక్రియ నేటి ఉదయం 10:30గంటల నుంచి ప్రారంభం కానుంది. నామినేషన్లు స్వీకరించేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.



# పరిషత్ సమరం

## నేడే తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్

- ఉదయం 10:30 నుంచే నామినేషన్ల స్వీకరణ
- జిల్లాలో రెండు విడతల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- అక్టోబరు 13 నుంచి రెండో విడత నామినేషన్లు
- న్యాయస్థాన తీర్పుపై కొనసాగుతున్న ఉత్కంఠ
- తీర్పు వచ్చేవరకు వేచిచూసే ధోరణితో ఆశావహులు
- దీంతో తొలిరోజు నామినేషన్లపై ప్రభావం
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం
- తొలివిడత 10 జెడ్పీటీసీ స్థానాలు, 110 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు
- జిల్లాలో 7,52,259 మంది గ్రామీణ ఓటర్లు
- ఫరూఖ్‌నగర్ మండలంలో అత్యధికంగా 51,104
- అత్యల్పంగా ఆమనగల్‌లో 14,712 మంది ఓటర్లు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

జిల్లాలో మొత్తం 21 జెడ్పీటీసీ స్థానాలు, 230 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటికి రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. తొలివిడత ఈనెల 23వ తేదీన, రెండో విడత ఈనెల 27వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరగనుంది. తొలివిడతకు సంబంధించి నేటి నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. 12వ తేదీన నామినేషన్ల పరిశీలన జరిపి సాయంత్రం 5 గంటల తర్వాత చెల్లుబాటైన నామినేషన్లను ప్రకటిస్తారు. వీటిపై 13వ తేదీ సాయంత్రం వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 14వ తేదీన అభ్యంతరాలను

మిగతా 8వ పేజీలో...

**జిల్లాలోని ప్రాదేశిక స్థానాల వివరాలు**

- మండలాలు : 10
- జెడ్పీటీసీ స్థానాలు: 10
- ఎంపీటీసీ స్థానాలు: 110
- ఓటర్లు: 7,52,259
- పురుషులు: 3,76,873
- మహిళలు: 3,75,408
- ఇతరులు: 28

### తీర్పు తరువాతే పోటీపై నిర్ణయం?

పరిషత్ ఎన్నికలకు నేడు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నప్పటికీ ఆశావహులు నామినేషన్లు వేసేందుకు ఇంకా పూర్తిస్థాయిలో సన్నద్ధం కాలేదు. బీసీ రిజర్వేషన్లపై న్యాయస్థానంలో ఇంకా తుది తీర్పురాకపోవడంతో సర్వత్రా దీనిపై ఆసక్తి నెలకొంది. ఒక వేళ కోర్టు తీర్పు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వస్తే ఎన్నికలపై ప్రభావం పడే అవకాశం ఉండడంతో ఆశావహులు డైలమాలో ఉన్నారు. ముందు నుంచే అనవసరమైన ఖర్చుపెట్టుకోవడం కంటే న్యాయస్థాన తీర్పు తరువాత రణరంగంలో దిగుదామని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే కోర్టు తీర్పు వరకు వేచి చూస్తామని ఎక్కువ మంది ఆశావహులు అభిప్రాయపడుతున్నారు. దీంతో తొలి రోజు నామినేషన్లు అంతంత మాత్రంగానే దాఖలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**నామినేషన్ల వివరాలు**

| | తొలివిడత | రెండో విడత |
|---|---|---|
| నామినేషన్ల స్వీకరణ | 9 - 11 వరకు | 13 - 15 వరకు |
| పరిశీలన | 12వ తేదీ | 16వ తేదీ |
| ఉప సంహరణకు గడువు | 15వ తేదీ | 19వ తేదీ |
| పోలింగ్ | 23వ తేదీ | 27వ తేదీ |

## కలిసి కాపురం చేసేందుకు అంగీకరించలేదని..

- రెండో భార్యను చంపిన భర్త
- చున్నీతో ఉరేసి.. బండరాయితో మోది హత్య
- చేవెళ్ల మండలంలో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు


రజిత (ఫైల్)


జంగయ్య(ఫైల్)

చేవెళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కలిసి కాపురం చేసేందుకు అంగీకరించలేదన్న కోపంతో భార్యను భర్త చంపిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకన్నగూడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన వెంకన్నగూడకు చెందిన వనరాసి జంగయ్య వృత్తి రీత్యా డ్రైవర్. అయితే ఇతనికి మొదటి భార్య ఉండగానే రెండో వివాహం రజిత వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు అమ్మాయిలున్నారు. సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే మూడేళ్ల క్రితం భర్తను వదిలేసి రజిత అదే ప్రాంతంలో వేరేచోట ఒంటరిగా ఉంటుంది. ఇటీవల ఆచూకీ తెలుసుకున్న జంగయ్య భార్య దగ్గరికి వెళ్లాడు. మొదటి భార్యతో సహా అందరం కలిసి ఉందామని సర్దిచెప్పి స్వగ్రామం వెంకన్నగూడ గ్రామానికి తీసుకొచ్చాడు. తనతో కలిసి ఉండేందుకు మూడు రోజులుగా ఆమెను ఒప్పించే ప్రయత్నం చేశాడు. గ్రామంలో పెద్దమనుషుల వద్ద పంచాయితీ కూడా పెట్టారు. అక్కడ కూడా ఆమె భర్తతో కలిసి ఉండేందుకు ఒప్పుకోలేదు. దీంతో ఆగ్రహించిన జంగయ్య ఆమెను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో మంగళవారం సాయంత్రం చిట్టెంపల్లి గేట్ వద్దకు మద్యం కొనుగోలు చేసి ఇంటికి వచ్చి భార్యతో కలిసి సేవించాడు. కాగా, రాత్రి 12 గంటల సమయంలో భార్యాభర్తలు గొడవపడ్డారు. ఇదే అదునుగా భావించిన చున్నీతో రజిత మెడకు చుట్టి జంగయ్య హత్యచేశాడు. చనిపోలేదని భావించి పక్కనే ఉన్న సిమెంట్ బండరాయితో తలపై బాదాడు. దీంతో రజిత అక్కడిక్కడే మృతి చెందింది. అనంతరం జంగయ్య తన పిల్లలకు వీడియోకాల్ చేసి ఆమె మృతదేహాన్ని చూపించాడు. అలాగే గ్రామ సర్పంచ్ విజయలక్ష్మీ నర్సింలుకు ఫోన్‌చేసి తన భార్యను హత్య చేసినట్లు చెప్పారు. వెంటనే ఆయన చేవెళ్ల పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని హత్యకు పాల్పడిన భర్తను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు.


ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమావేశమైన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

## లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోళ్లు చేయాలి

- అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోళ్లు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశం నిర్వహించారు. జిల్లాలో 33 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 23, ఐకేపీ ఆధ్వర్యంలో 3, డీసీఎంఎస్ ద్వారా 7 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరీష్ తెలిపారు. సన్న రకం 15 వేల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఏ-గ్రేడ్ రూ.2389, సాధారణ రకం రూ.2369 ధరకు క్వింటా చొప్పున కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం కాగా సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్‌గా ఇస్తామన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా కోఆపరేటివ్ అధికారి సుధాకర్, జిల్లా వ్యవసాయాధికారి ఉష, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండీ రియాజ్, డీఎల్ఎంవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలను వ్యాపారంగా
**మార్చిన కాంగ్రెస్**
- ఆ పార్టీకి బుద్ధి చెప్పే సమయమొచ్చింది
- మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్
7

**రేడియల్ రోడ్డు ఏర్పాటుకు సర్వే**
7

**హామీల అమలులో ప్రభుత్వం విఫలం**
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
7

## పిడుగుపాటుకు ఇద్దరి మృతి

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల/యాచారం/మాడ్గుల, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలంలోని నల్లవెల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం పిడుగు పాటుకు ఓ విద్యార్థి దుర్మరణం చెందాడు. నల్లవెల్లి గ్రామానికి చెందిన జోగు మనీష్(12) ఏడవ తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటుండగా ఉరుములు మెరుపులతో వర్షం కురిసి బాలునిపై పిడుగు పడింది. దీంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లముందే కుమారుడు చనిపోవడంతో తల్లి దండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. అలాగే మాడ్గుల మండలంలో పిడుగుపడి వ్యక్తి మృతిచెందాడు. అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అల్లి బుచ్చయ్య(55) అదేగ్రామానికి చెందిన గౌరవరం బుచ్చిరెడ్డి వద్ద ఆవులు షెడ్డులో పని చేయడానికి జీతానికి కుదిరాడు. అయితే పశువులకు గడ్డి కోస్తుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.


ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో..


మనీష్, బుచ్చయ్య మృతదేహాలు

### పట్నంలో మోస్తరు వర్షం

ఇబ్రహీంపట్నం టౌన్‌తో సహా రూరల్ ప్రాంతంలో బుధవారం సాయత్రం 4.30 గంటలకు ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. 20 నిమిషాలపాటు కురిసిన వానకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. అలాగే పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి జనం ఇబ్బందులు పడ్డారు.

## 'అభ్యర్థులను ఏకగ్రీవం చేసుకోవాలి'



షాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో చదువుకున్న, నిజాయితీ కలిగిన వ్యక్తులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యుడు జాకీ షరీఫ్ తెలిపారు. బుధవారం షాబాద్ మండలంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుకు వృథా ఖర్చులు చేయొద్దని అభ్యర్థులకు సూచించారు. డబ్బులు ఖర్చు చేసి గెలుపొందినవారు గ్రామాభివృద్ధికి పాటుపడలేరన్నారు. కులమతాలకతీతంగా గ్రామాభివృద్ధికి పనిచేసే చదువుకున్న వ్యక్తిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని సూచించారు.

## హామీలు అమలుచేయని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం యాచారంలో కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు పంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల కంటే ముందు ఇచ్చిన ఆసరా పెన్షన్, కళ్యాణ లక్ష్మీ పథకం కింద తులం బంగారం, రూ. 500లకు వంట గ్యాస్ పథకాలు విస్మరించారని మండిపడ్డారు. ఫార్మాసిటీ పేరుతో పేదల భూములు తీసుకోమని ప్రజలను నమ్మించి నేడు అడ్డగోలుగా సేకరించడం ఏమిటని ప్రశ్నించారు. రెండేళ్ల గడుస్తున్న మీరాఖాన్‌పేట్ నుండి కందుకూర్ వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణం చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు. సొసైటీ చైర్మెన్ పదవుల నుంచి తమ పార్టీ వారిని తొలగించి కాంగ్రెస్ వాళ్లను నియమించడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమేనన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి, వెంకట రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగమ్మ, కర్నాటి రమేష్, బూడిద రాంరెడ్డి, రాజేందర్ రెడ్డి, మరోజు శ్రీనివాస్ చారి, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

## ఇంకెన్నాళ్లు..?

## అసంపూర్తిగా సమీకృత మార్కెట్

- మూడేళ్లుగా పూర్తికాని నిర్మాణం
- రూ.3 కోట్లకు నయా పైసా రాని వైనం
- నిధులు మంజూరైతేనే ముందుకు సాగనున్న పనులు
- ఎదురు చూస్తున్న వ్యాపారులు

ఆదిభట్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ పరిధిలో గత ప్రభుత్వం హయాంలో ప్రతీ మున్సిపాలిటీలో ప్రజలకు, వ్యాపారులకు అందుబాటులో ఉండేవిధంగా సమీకృత మార్కెట్ సముదాయానికి శ్రీకారం చుట్టింది. మున్సిపల్‌కు కొద్దిదూరంలో ప్రభుత్వ స్థలం కేటాయించి పబ్లిక్ హెల్త్ నిధుల నుంచి రూ.3 కోట్లతో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. మూడు వైపులా షెడ్డు, మధ్యలో ఖాళీ ప్రదేశం ఉండేలా డిజైన్ చేశారు. ఇందులోనే మటన్, చికెన్, ఫిష్‌తో పాటు కూరగాయలు, పండ్లు, పూల క్రయవిక్రయాలు జరిగేలా నిర్మాణం ప్రారంభించారు. మొదట్లో పనులు చకచకా సాగాయి. ఆ తరువాత నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశాడు. దీంతో మూడేళ్లుగా మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తుంది.


మార్కెట్ నిర్మాణ

### ముందుకు సాగని పనులు

సమీకృత మార్కెట్ పనులు ప్రారంభించి మూడేళ్ల గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. ఈ మార్కెట్ అందుబాటులోకి వస్తే మున్సిపల్ ప్రజలకు ఒకేచోట

మిగతా 8వ పేజీలో...

### ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



సమీకృత మార్కెట్ నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. అది వినియోగంలోకి వస్తే ఆదిభట్ల మరింత అభివృద్ధి చెందుతుంది. రోడ్లపై అమ్ముకునే చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సంబంధించిన అధికారులతో మాట్లాడించి మరిన్ని నిధులు కేటాయించాలి.

- పయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు, ఆదిభట్ల


స్కేటింగ్ పోటీలను జెండాఊపి ప్రారంభిస్తున్న కేఎల్లార్

## క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని, ప్రతీరోజు ఉదయం నడక, వ్యాయామంతో ఆరోగ్యంగా ఉండవచ్చని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జీ కేఎల్లార్ అన్నారు. బుధవారం తుక్కుగూడలో తెలంగాణ రాష్ట్ర 12వ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, బొక్క జంగారెడ్డి, మురళీధర్ రెడ్డి, అంజయ్య, యాదయ్య, అల్లెకుమార్, రాజునాయక్ పాల్గొన్నారు.

### అట్టడుగు వర్గాల రిజర్వేషన్లపై బీజేపీ కుట్ర

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అపహాస్యం చేస్తూ దేశ ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరం ఉందని కేఎల్లార్ అన్నారు. బీజేపీ చేస్తున్న ఓటు చోరీపై బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమీర్‌పేటలో ప్రజలనుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతూ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ తీరుపై పోరాటం చేయాలన్నారు. ఓటు చోరీపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంతో బీహార్‌లో ఎన్నికల కమిషన్ పోలింగ్‌లో మార్పులు చేసిందన్నారు. అలాగే రానున్న ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లో నిబంధనలను కట్టుదిట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, కాకి ఈశ్వర్, విఠల్‌నాయక్, యాదయ్య, రాజునాయక్, మర్యాద మురళీధర్‌రెడ్డి, అంజయ్య, అల్లెకుమార్, నడికూడ శివ, లాజర్ పాల్గొన్నారు.

## సోషల్ మీడియాను నమ్మి మోసపోవద్దు

నవాబుపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూసి ఇన్వెస్ట్ చేసి మోసపోవద్దని మోమిన్‌పేట్ సీఐ వెంకట్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల నవాబుపేట్‌కు చెందిన ఇద్దరు ఆన్‌లైన్ ద్వారా రూ.6లక్షలు పెట్టుబడి పెట్టారని, మరో వ్యక్తి గేమింగ్ అప్లికేషన్‌లో ఇన్వెస్ట్ చేసి మోసపోయాడన్నారు. ఈ కేసుల్లో 1930 నంబర్ ద్వారా సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



# బిల్లులు ఇవ్వాలని కాంట్రాక్టర్ల ఆందోళన



సన్వార్స్ రైల్‌టెక్ కంపెనీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సబ్ కాంట్రాక్టర్లు

యాలాల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్-చించోలి జాతీయ రహదారి పనుల బిల్లులు నాలుగు నెలలుగా చెల్లించకపోవడంతో సబ్ కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం యాలాల్ మండలం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా సమీపంలోని సన్వార్స్ రైల్‌టెక్ కంపెనీ కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేశారు. సబ్ కాంట్రాక్టర్లు మాట్లాడుతూ.. తాము కొడంగల్ నుంచి లక్ష్మీనారాయణపూర్ వరకు రోడ్డు పనులు పూర్తి చేశాం. తమకు రూ.2.49కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. బిల్లుల కోసం అడిగితే ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముంబైకి చెందిన ఎస్ఎంసీ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఈ ఎన్‌హెచ్167 ప్రాజెక్ట్ పనులు దక్కగా.. వారు సన్వార్స్ రైల్‌టెక్ కంపెనీకి అప్పగించారని తెలిపారు. ఆ సంస్థ నుంచి ఓం శివసాయి శ్రీనివాస్ కన్‌స్ట్రక్షన్స్, కేవీఆర్ ఇన్ఫ్రా, వీహెచ్ కన్‌స్ట్రక్షన్స్, ఏఎన్ ఎంటర్‌ప్రైజెస్, సురేష్‌నాయక్, శ్రీకాంత్, కేజీఆర్ ఇన్ఫ్రా వంటి సంస్థలు సబ్ కాంట్రాక్ట్ తీసుకొని పనులు చేశామని తెలిపారు. బిల్లులు చెల్లించడం లేదని ఆఫీసు సిబ్బందిని బయటకు పంపి తాళం వేశామన్నారు. కార్యక్రమంలో హరిప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, సురేష్‌వరప్రసాద్ తదితర సబ్‌కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## బడి ఆవరణలో పాముల కలకలం



పాఠశాల ఆవరణలో చంపిన పాములు

యాలాల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో పాములు కలకలం సృష్టించాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు రెండు పాములు కన్పించాయి. విద్యార్థులు గ్రామస్తులకు తెలపడంతో వారొచ్చి పాములను చంపేశారు. మరికొద్ది సేపటికి మరో రెండు పాములు రాగా వాటిని సైతం చంపేశారు. సంవత్సరం క్రితం కూల్చిన పాఠశాల శిథిలాల కింద పాములు మరుగు చేశాయని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పాఠశాల పక్కన ఉన్న రాళ్లను తొలగించాలని కోరారు.

## విరబూసిన బ్రహ్మ కమలాలు



ఘట్‌కేసర్,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పరిధి ఎన్ఎఫ్‌సీనగర్ బీ-1లో ఆలపాటి మల్లికార్జున్‌రావు నివాసంలో బ్రహ్మ కమలాలు విరబూశాయి. మల్లికార్జున్‌రావు ఇంటి ఆవరణలో వివిధ రకాల పూల మొక్కలను పెంచుతున్నాడు. మంగళవారం రాత్రి ఆయన ఇంటి ఆవరణలోని బ్రహ్మ కమలం మొక్కకు ఏకంగా ఏడు పుష్పాలు పూసి కనువిందు చేశాయి.

## సాగారం తండాలో టీచర్‌ను నియమించాలి



డీఈవో రేణుకాదేవికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

దుద్యాల, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగారం తండా పాఠశాలలో 50మందికిపైగా విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారని, మరో టీచర్‌ను నియమించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేర కు బుధవారం డీఈవో రేణుకాదేవికి వినతిపత్రం అందించారు. స్పం దించిన డీఈవో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలని ఎంఈవో విజయ రామారావుకు సూచించారు.కార్యక్రమంలో నరేశ్‌రాథోడ్, కురవ ఆంజనేయులు, గోపాల్, లాలూనాయక్, కిషన్‌నాయక్, కురువ అంజనేయులు, కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ వర్కర్ల సమస్యలు తీర్చాలి

కొడంగల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): హాస్టల్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. బుధవారం కొడంగల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో హాస్టల్ వర్కర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. హాస్టళ్ల పనివారికి రెండు, మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అరకొర వేతనాలతో పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగభద్రత సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

## పెండింగ్ వేతనాలను చెల్లించాలి



జిల్లా నోడల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

దౌల్తాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న వారికి పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్‌కు బుధవారం అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. తొమ్మిది నెలల వేతనాలను చెల్లించే వరకూ విధులకు హాజరు కాలేమని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగు నెలల వేతనాలు ఇప్పటి వరకు రాలేదని, ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వడం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలను వెంటనే అందజేయాలని కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

మోమిన్‌పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌వో, ఏఆర్‌వో, జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆర్‌వో, ఏఆర్‌వోలు 12ఎంపీటీసీలకు, ఒక జెడ్పీటీసీ స్థానానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తులను పరిశీలించి స్వీకరించాలన్నారు. సమావేశంలో ఎంఈవో మల్లేశం, ఎంపీవో యాదగిరి, ఆర్‌వో, ఏఆర్‌వోలు, జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎన్నికల సామగ్రి పరిశీలన

తాండూరు రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామగ్రి మండల పరిషత్ కార్యాలయానికి చేరింది. దీనిని బుధవారం ఎంపీడీవో విశ్వప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ కోసం నామినేషన్ల పత్రాలు, డిపాజిట్ రసీదులు, కవర్లు, ఎన్నికల కరదీపిక తదితర వస్తువుల సరఫరా, గణన, భద్రత వంటి అంశాలను తనిఖీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. సామగ్రి పూర్తిస్థాయిలో ఉందని, మిగతా ఏర్పాట్ల కోసం మండల పరిషత్ కార్యాలయంలో ఒక గదిలో భద్రపరిచామన్నారు.

## నానో యూరియాతో పంటకు మేలు

కొడంగల్ రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో నీరు పట్టిన పత్తి పంట కోలుకునేందుకు పంటపై నానో యూరియా పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి తులసి అన్నారు. బుధవారం రుద్రారానికి చెందిన రైతు కిష్టప్ప పత్తి చేనుకు నానో యూరియా పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా నానో యూరియా ప్రయోజనాలను వివరించారు. ఏఈఓలు శ్రీపతిరెడ్డి, పావని, రైతులు ఉన్నారు.



పత్తి పంటపై నానో యూరియా పిచికారి చేయిస్తున్న ఏవో తులసి

## 'డబుల్' ఇళ్లలో సమస్యలు పరిష్కరిస్తా



డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్సీ రహమత్ బేగ్

శంకర్‌పల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మునిసిపాలిటీలో డబుల్ బెడ్ రూం ఇళ్లను బుధవారం ఎంఎల్‌సీ రహమత్‌బేగ్ పరిశీలించారు. లబ్ధిదారులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని అన్నారు. బస్సు సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతానన్నారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద ఉన్న షటర్‌లకు అధికారులు వెంటనే టెండర్‌లు వేయాలని అన్నారు. ఆయనతో ఖురేసి, ఇబ్రహీం, షరీఫ్, అంజుమ్, నమీన, షాహిద్ అలీ ఉన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కారు స్పీడ్‌ను అడ్డుకోలేరు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కారు స్పీడ్‌ను ఎవరూ అడ్డుకోలేరని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం దోమలోని ఎస్‌జీ గార్డెన్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్‌ను ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. మహేశ్‌రెడ్డి సోదరుడు అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ చిన్నాన్న కొప్పుల నాగిరెడ్డిని రాజకీయ కక్షతోనే జైలుకు పంపించారని ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి తప్పు చేయని తనను అక్రమ మైనింగ్ పేరుతో జైలుకు పంపారన్నారు. సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి మాట్లాడుతూ.. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, పార్టీ మండలాధ్యక్షుడు గోపాల్‌గౌడ్, రాజగోపాలచారి, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఖాజాపాషా, రాములు పాల్గొన్నారు.

## పుస్తక పఠనం ఉత్తమ అలవాటు



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ అర్చన

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం ఎంబీఏ-బీఏ విద్యార్థులకు ఓరియేంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ అర్చన మంత్రి ముఖ్య అతిథిగా వచ్చి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మెటా ఏఐ, జనరేటివ్ ఏఐ వాడకంతో విద్యార్థులు పుస్తక పఠనం అలవాటును మర్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తక పఠనం ఉత్తమ అలవాటన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీన్ బాలాజీ, డైరెక్టర్ అఫ్ అడ్మిషన్స్ మహిపతి శ్రీనివాస్‌రావు, హెచ్‌వోడీలు సురేష్, మన్సూర్ పాషా, సుప్రియ, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో పథకాలు మాయం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలు వంటి మహిళా సంక్షేమ పథకాలు మాయమయ్యాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మహిళా నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో మహిళలకు ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లతో గౌరవం లభించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం గర్భిణులకు కిట్ లేకపోవడం, బతుకమ్మ చీరల పంపిణీ నిలిచిపోవడం, మిషన్ భగీరథ పథకం సరిగా నడవక మహిళలు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. షీ టీమ్స్ పనితీరు తగ్గి, మహిళలపై నేరాలు పెరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలకు నెలనెలా ఇస్తామన్న రూ.2,500 సాయం, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, వేతనాల పెంపు వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజలు మోసపూరిత కాంగ్రెస్‌కు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహిపాల్‌రెడ్డి, పడిగళ్ల అశోక్, శివకుమార్, గయాజ్, మల్లేశ్‌యాదవ్, మహిపాల్‌నాయక్, ఉపేందర్‌రెడ్డి, కవితాఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'వరల్డ్ ఆఫ్ ఏవియేషన్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సీఐఎస్ఎఫ్ డీఐజీ శివకుమార్ మెహంకా రచించిన 'అబోవ్ అండ్ బియాండ్, ఎక్స్‌ప్లోరింగ్ ది అమేజింగ్ వరల్డ్ ఆఫ్ ఏవియేషన్' అనే పుస్తకాన్ని ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయకుడు ఆవిష్కరించారు. సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీలో అనుభవం ఉన్న సాధకుడు మెహంకా 30ఏళ్లకుపైగా పౌర విమానయాన రంగంలో తన అనుభవాలతో ఈ పుస్తకాన్ని రూపొందించారు. మంత్రి మాట్లాడుతూ.. ఈ పుస్తకం దేశ విమానయాన రంగానికి ఒక ఎన్సైక్లోపిడియా లాంటిదన్నారు. రచయిత మెహంకా మాట్లాడుతూ.. విమానయానం అంటే విమానాలు, ప్రయాణికుల గురించి మాత్రమే కాదని, ప్రజలు, కచ్చితత్వం, పురోగతి గురించి ఈ పుస్తకంలో తెలుసుకోవచ్చన్నారు.

## 'కాంగ్రెస్‌లో చేరికలు అబద్ధం'

తాండూర్ రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని చేజంస్పూర్, కోనాపూర్ గ్రామాల నుంచి కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారన్న వార్తలు అబద్ధమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రవీణ్‌గౌడ్ రెండేళ్ల క్రితమే పార్టీకి రాజీనామా చేసి ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరారని చెప్పారు.



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న డీఈవో సుశీంద్రరావు

# స్వచ్ఛంద సంస్థల సహకారం సంతోషకరం

» డీఈవో సుశీంద్రరావు

శంకర్‌పల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద సంస్థలు సహాయ సహకారాలు అందించడం శుభ పరిణామమని డీఈవో సుశీంద్రరావు తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో కేఎస్‌పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ తరగతి గదిలో నిర్మితమవుతుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా కేఎస్‌పీ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ అస్మా నిఖత్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నార్సింగి ఏసీపీ రమణగౌడ్, తహసీల్దార్ సురేందర్, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, సీఐలు శ్రీనివాస్‌గౌడ్, వీరబాబు, ఎంఈవో అక్బర్, ప్రధానోపాధ్యాయురాలు నౌసీన్ సుల్తానా, సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తాహేర్ అలీ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉదయశ్రీ, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సలీంపాషా తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ విరమణ సహజం

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

» రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం



కాశీపతి దంపతులను సన్మానిస్తున్న రాజేశ్‌రెడ్డి, ఎంఈవో

బొంరాస్‌పేట్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనేది తప్పదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్‌లో నిర్వహించిన మెట్లకుంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశీపతి వీడ్కోలు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రాజేశ్‌రెడ్డి, ఎంఈవో హరిలాల్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా కాశీపతి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం కాశీపతి దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కొడంగల్ ఎంఈవో రాంరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, చంద్రశేఖర్, మల్లయ్య, గోపాల్, రవీందర్‌గౌడ్, ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, రమణారెడ్డి, రాధాకృష్ణ, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డితో రైతులు

## రేడియల్ రోడ్డు ఏర్పాటుకు సర్వే

షాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్‌ఆర్ వరకు నిర్మించే రేడియల్ రోడ్డు ఏర్పాటుకు సర్వే పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం మండలంలోని నాగర్‌కుంట, మాచన్‌పల్లి, భువనగిరిపల్లి పరిధిలో సర్వేను చేశారు. నెల రోజుల క్రితం నాగర్‌కుంట, మల్లారెడ్డిగూడల మధ్యలో చేసిన సర్వే కాకుండా కొత్తగా సర్వే చేస్తూ మార్కింగ్ ఇస్తున్నారు. దీంతో భూములు కోల్పోతున్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పలుకుబడి ఉన్న వారి భూములు పోకుండా, పేదల భూములే పోయేలా రోడ్డు అలైన్మెంట్ మారుస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని రైతులు కలిసి తమ సమస్యను విన్నవించారు.



రేడియల్ రోడ్డు నిర్మాణానికి సర్వే చేస్తున్న సిబ్బంది

## ప్రొఫెసర్ షేక్ ఇమామ్ వలీకి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ప్రొఫెసర్ షేక్ ఇమామ్ వలీ

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగు కళాశాలకు చెందిన ప్రొఫెసర్ షేక్ ఇమామ్‌వలీకి డాక్టరేట్ లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో డాక్టర్ శ్రీనివాసులు తుపాకుల ఆధ్వర్యంలో డిజైన్ డెవలప్‌మెంట్ ఆఫ్ స్వాప్ ప్లాస్మన్ పోలరైజేషన్‌పై చేసిన పరిశోధనకు ఇమామ్‌వలీకి డాక్టరేట్ వచ్చింది. బుధవారం కేపీఆర్ఐటీ వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ స్ట్రాటజీ కొమ్మూరి దివ్యశ్రీ, డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌కశ్యప్, ఈసీఈ హెచ్‌వోడీ విశ్వశ్రీ, అధ్యాపకులు ఇమామ్‌ను అభినందించారు.

### నిబంధనల మేరకే బాణసంచా దుకాణాలు

తాండూరు, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకొని బాణసంచా దుకాణాలను నిబంధనల మేరకు ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పటాకుల దుకాణాల ఏర్పాటు చేసే యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనావాసాల మధ్య బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్‌కుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ యాదగిరి

# నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్/మర్పల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏటీసీల్లో సాంకేతిక నైపుణ్యంతో కూడిన శిక్షణను అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఆధునాతన సాంకేతిక కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏటీసీలోని సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏటీసీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి కావాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. శిక్షణ నిమిత్తం వచ్చిన విద్యార్థులను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఏటీసీలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఏటీసీలో ఫర్నిచర్ లేని పరిస్థితి గ్రహించిన కలెక్టర్ విద్యార్థులకు సరిపోను కుర్చీలను సమకూరుస్తానని తెలిపారు. కలెక్టర్ వెంట ఏటీసీ ఇన్‌చార్జి ఎస్.ఎం సరూశ్, ఏటీ సిబ్బంది ఉన్నారు.



మర్పల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

### మర్పల్లి ఏటీసీ సందర్శన

అలాగే మర్పల్లి మండల కేంద్రంలోని ఆధునాతన సాంకేతిక కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటీసీలలో శిక్షణ పొందిన వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం అక్కడ సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. నూతన భవనం అయినప్పటికీ వర్షం కురిసినప్పుడు పైకప్పు నుంచి నీరు లీకేజీ అవుతుందని అధ్యాపకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పక్కనే ఉన్న జూనియర్ కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని అధ్యాపకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో జయరాం, ప్రిన్సిపాల్ సుధీర్ పటేల్, ఏటీసీ ఇంచార్జ్ ప్రకాశ్, ఏటీసీ సిబ్బంది పాల్గొన్నారు

# లగచర్లకు విద్యా సంస్థలు?

## కొడంగల్‌లో ఎడ్యుకేషన్ హబ్ ఉట్టి మాటేనా..?

» మెడికల్ కాలేజీ, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు తరలిపోతాయని ప్రచారం

» ప్రతిపాదిత ప్రాంతంలోనే పెట్టాలని స్థానికుల డిమాండ్

కొడంగల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల స్థాపనతో కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుందని భావించిన ప్రజలకు నిరాశే మిగులుతోందనే ప్రచారం సాగుతోంది. కొడంగల్ పరిసరాల్లో తలపెట్టిన మెడికల్ కళాశాల, సమీకృత గురుకులం లగచర్లకు తరలిస్తున్నారనే వార్తలు విన్పిస్తున్నాయి. తరలింపునకు భవనాల నిర్మాణం చేపడుతున్నారని చెబుతున్నారు. అయితే కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో మెడికల్ కాలేజీకి 60 ఎకరాలు సేకరించారు. ఈ మెడికల్ కళాశాలకు అనుబంధ ఆస్పత్రుల కోసం కొడంగల్, తాండూర్ మార్గ మధ్యలో స్థలాన్ని ఎంపిక చేశారు. ఆ జాగకు ప్రహరీ కట్టి రోడ్డు పనులను చేస్తున్నారు. అంతలోనే మెడికల్ కాలేజీని లగచర్లకు తరలిస్తున్నారనే వార్తలొస్తున్నాయి. అలాగే పాత కొడంగల్‌లో తలపెట్టిన సమీకృత గురుకులాలను సైతం లగచర్ల, హకీంపేట్‌లకు తరలిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కోస్గిలోని ఇంజినీరింగ్ కళాశాల తదితర వాటిని ఒకే చోట ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తెలుస్తోంది.




సమీకృత గురుకులాలకు భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు(ఫైల్)

### ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకని...

సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో విద్యాసంస్థల ఏర్పాటుతో ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు చర్యలు చేపట్టారు. కొడంగల్ ప్రాంతంలో రూ.150కోట్లతో 20ఎకరాల్లో 11 అక్టోబరు 2024న ముఖ్య నాయకులు, అధికారులు భూమిపూజ చేశారు. ఇప్పటికే పనులు చేపట్టగా గురుకులాలను తరలిస్తున్నారనే ప్రచారానికి తెరలేసింది. ఈ నేపథ్యంలో కొడంగల్ ప్రాంతంలోనే విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ సేకరించిన భూముల్లోనే విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలంటున్నారు. అప్పాయిపల్లిలో మెడికల్, వెటర్నరీ కళాశాలలు, పాత కొడంగల్ వద్ద ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి, అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

### విద్యా సంస్థలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలి

కొడంగల్‌కు మంజూరైన మెడికల్, వెటర్నరీ కళాశాలలు, పాత కొడంగల్ వద్ద ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను వేరే ప్రాంతాలకు తరలించొద్దని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. బుధవారం కడా ప్రత్యేకాధికారి వెంకటరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. వెనకబడిన కొడంగల్ ప్రాంతానికి మంజూరైన విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు అబ్దుల్‌హక్, కృష్ణకుమార్, కరుణాకర్, ఆశప్ప, ఎఫ్.నర్సిములు, నర్సింగ్, నాగప్ప, రమేశ్ పాల్గొన్నారు.

# చెరువులు, నాలాలను కాపాడుతాం

» హైడ్రా కమిషనర్ రంగనాథ్

» దేవరయంజాల్ పరిధిలో క్షేత్ర స్థాయి పరిశీలన

శామీర్‌పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు గురైన చెరువులు, నాలాల స్థలాలను రక్షించి పునరుద్ధరిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ భరోసానిచ్చారు. మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయంజాల్, మందాయిపల్లి పరిధిలో పలు చెరువుల, నాలాలు, రోడ్డు స్థలాలను పలువురు కబ్జా చేశారని గ్రామస్తులు హైడ్రాకు, కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు బుధవారం అన్యాక్రాంతానికి గురైన స్థలాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ ప్రశాంత్, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన ప్రాంతాలను సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్రమార్కుల కబ్జా నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానికులు కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. దీంతో స్పందించిన ఆయన అవసరమైన సర్వేలను జరిపి నివేదిక అందజేయాలని ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే తూంకుంట-గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల సరిహద్దు రోడ్లను, స్థలాలను కూడా ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ రెండు బల్దియాల సరిహద్దు రోడ్ల విషయంలో కొన్నాళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ వివాదాలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులతో కలసి సరిహద్దు స్థలాలను పరిశీలించారు.



దేవరయాంజాల్ స్థానికులతో మాట్లాడుతున్న రంగనాథ్

# ప్రీ ప్రైమరీ స్కూల్‌ను తరలించొద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» ఎమ్మార్సీ వద్ద నాయకులు, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామస్తుల ధర్నా

» ఇన్‌చార్జి ఎంఈవోకు వినతిపత్రం అందజేత

కేశంపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్రీ ప్రైమరీ పాఠశాలను ఎక్లాస్‌ఖాన్‌పేట నుంచి సంగెంకు తరలింపును నిలిపివేయాలని బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి రావుల రాకేశ్ ఆధ్వర్యంలో బుధవారం కేశంపేట ఎమ్మార్సీ వద్ద ధర్నా చేపట్టారు. ఈ అంశంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కాగా స్పందించిన నాయకులు ప్రీ ప్రైమరీ స్కూల్‌ను తరలించొద్దని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. సాంక్షనైన ఎక్లాస్‌ఖాన్‌పేటలోనే ప్రీ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. వారిలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ, జిల్లా సాంస్కృతిక విభాగ కోకన్వీనర్ కె.నరేందర్‌రెడ్డి, యుగంధర్, శ్రీకాంత్, మణికంఠ, శ్రీధర్, రాము, రమేశ్ ఉన్నారు. కాగా ప్రీ ప్రైమరీ స్కూలును ఎక్లాస్‌ఖాన్‌పేట నుంచి సంగెంకు మార్చుతూ ఉత్తర్వులేవీ రాలేదని ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ అన్నారు. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ స్టేట్ డైరెక్టర్ నవీన్ నికోలస్ నుంచి కలెక్టర్‌కు ఉత్తర్వులొచ్చినట్లు తమ కార్యాలయానికి లెటర్ మాత్రం అందిందన్నారు. అయితే డీఈవో ద్వారా సపోర్టెడ్ ఆర్డర్స్ వస్తేనే మార్పు ఉంటుందన్నారు. పాఠశాల మార్పుపై గ్రామస్తులు ఆందోళన చెందొద్దని చెప్పారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే లెటర్ ఇచ్చిన కారణంగానే ప్రీ ప్రైమరీ స్కూల్‌ను ఎక్లాస్‌ఖాన్‌పేట నుంచి సంగెంకు మార్చుతున్నారని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై నియోజకవర్గంలో ప్రధానంగా చర్చించుకున్నారు. షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే లెటర్ తీసుకున్న సంగెంకు చెందిన వ్యక్తికి ఫోన్ లెటర్‌ను ఇలా దుర్వినియోగం చేస్తారా? అని మందలించినట్లు సమాచారం. పార్టీని అడ్డం పెట్టుకొని ఎమ్మెల్యేను బద్నాం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని చెప్పినట్లు తెలిసింది.



ఎమ్మార్సీ వద్ద ధర్నా చేస్తున్న బీజేవైఎం నాయకులు, గ్రామస్తులు



కాంగ్రెస్ ప్రభుత్వ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న సబితారెడ్డి

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కందుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 22 నెలలవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. బుధవారం మీర్కాన్‌పేటలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సబితారెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఒక్కటైనా పూర్తిగా అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. నమ్మించి ఓట్లేయించుకొని ప్రజలను నట్టేట ముంచినట్టు ఉందన్నారు. మీర్కాన్‌పేటలో తలపెట్టిన ఫ్యూచర్ సిటీ పక్కనే గత ప్రభుత్వం మెడికల్ కాలేజీకి 20ఎకరాలను కేటాయించి నిధులు మంజూరు చేసిందని సబిత గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కాలేజీని ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. అలాగే కందుకూరు-యాచారం మండలాలను కలిపే రోడ్డును బీఆర్ఎస్ ప్రభుత్వంలో 75శాతం పూర్తిచేశామని, మిగిలిన పనులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రోడ్డును పరిశీలించారు. ఫోర్త్ సిటీ అభివృద్ధికి కీలకమైన ఈ రోడ్డే వేయకుంటే మున్ముందు ఏదీ చేయరనే అనుమానం కలుగుతోదన్నారు. రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని అక్కడి నుంచే అధికారులకు ఫోన్ చేశారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధిలో నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ పాలకులకు స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, డి.చంద్రశేఖర్, జ్యోతిచంద్రశేఖర్, కె.రాములు,రాజశేఖర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, పొట్టి ఆనంద్, లచ్చ్యానాయక్, ఇందిరదేవేందర్, టి.కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, పారిజాత, దేవీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలను వ్యాపారంగా మార్చిన కాంగ్రెస్

» ఆ పార్టీకి బుద్ధి చెప్పే సమయమొచ్చింది

» మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్



బాకీ కార్డులను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

ఆమనగల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మాయ మాటలతో ప్రజలను వంచించి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీ పాలనకు తెరలేపిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. హామీలు, గ్యారంటీలను అమలు చేయకుండా మోసగించిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆమనగల్లులోని లక్ష్మీగార్డెన్‌లో బుధవారం బీఆర్ఎస్ మండల, మున్సిపాలిటీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ బాకీ కార్డులను నాయకులు, కార్యకర్తలతో కలిసి జైపాల్ విడుదల చేసి ప్రజలకు పంచారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు బిల్లుల చెల్లింపుల్లో కమీషన్లు దండుకుంటూ రాజకీయాలను వ్యాపారంగా మార్చారని మండిపడ్డారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని 22నెలలైనా అమలు చేయలేదన్నారు. రియల్టర్ల భూములను కాపాడేందుకు ట్రిపుల్‌ఆర్ అలైన్మెంట్‌ను మార్చిన సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్‌కు జైపాల్‌రెడ్డి పేరుపెట్టి ఒక్క రూపాయైనా కేటాయించలేదన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం తథ్యం అని ఉప్పల వెంకటేశ్, అర్జున్‌రావు, పత్యానాయక్ అన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకురాలు ద్యాప విజితారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, జిల్లా, మండల నాయకులు శ్రీనునాయక్, డి.సత్యం, రఘు, ఖలీల్, భీమయ్య, రమేశ్, నిరంజన్‌గౌడ్, శంకర్, శేఖర్, ప్రసాద్, గణేశ్, సాయిలు, పంతూనాయక్, రాజు, మహేశ్, ప్రశాంత్‌నాయక్, హాజిపాషా పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయాలి

శంషాబాద్ రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, శంషాబాద్ మాజీ జెడ్పీటీసీ సతీశ్ అన్నారు. బుధవారం కవ్వగూడలో కాంగ్రెస్ బాకీ కార్డులను నాయకులు, కార్యకర్తలతో విడుదల చేశారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మంచాల మోహన్‌రావు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, దీపమల్లేశం, పరమేశ్వరి, నరేందర్, రాజేందర్, పదం రాములు, రమేశ్, బాల్‌రాజ్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, చరణ్, శేఖర్‌యాదవ్, శ్రీశైలం పాల్గొన్నారు.



కాంగ్రెస్ బాకీ కార్డులను చూపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజు వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండల కేంద్రానికి చెందిన చింతబోయిన వెంకన్న(48) పోచారం మున్సిపాలిటీలో ఉంటూ ఘట్‌కేసర్‌లోని కావేరి బ్రిక్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మహబూబాబాద్ జిల్లా జయిరాకు చెందిన రొడంగి మల్లేష్(35), మండల వివేక్(24) పోచారం మున్సిపల్ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటూ కూలి పనులు చేస్తున్నారు. కాగా, వెంకన్న రెండురోజుల క్రితం వివేక్ సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లి కుదవపెట్టాడు. ఈ విషయంపై వివేక్, మల్లేష్ బుధవారం వెంకన్నను ఆటోలో ఎక్కించుకొని మద్యం తాగించి సెల్‌ఫోన్ గురించి అడిగి దాడికి పాల్పడ్డారు. తర్వాత వెంకన్న తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. ఆటోలో ఆయన ఇంటికి తీసుకెళ్లి వెంకన్నకు శ్వాస రావడం లేదని భార్యకు చెప్పారు. వెంటనే వెంకన్నను ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వెంకన్న మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన భర్తపై దాడిచేసి హత్య చేశారని వెంకన్న భార్య విలపించింది. వెంకన్నది హత్యనా, ఏదైనా కారణం చేత మృతిచెందాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మల్లేష్, వివేక్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పన్ను చెల్లించని వాహనాలను సీజ్ చేస్తాం

ఫటా ఫట్



**షాద్‌నగర్ ఎంవీఐ వాసు**

రోడ్డు రవాణా శాఖలో మార్పులు వస్తున్నాయి. వాహనదారులు కొందరు మార్పులను గమనించకుండా, నిబంధనలను పాటించకుండా వాహనాలను నడిపిస్తున్నారు. స్థానికంగా నడిపిస్తున్న ట్రాన్స్‌పోర్టు వాహనదారులు కొందరు ఫిట్‌నెస్, బీమా సౌకర్యాన్ని పట్టించుకోవడం లేదు. కొన్ని జీపులు, ఆటోలు ఓవర్ లోడ్‌తో నడుస్తున్నాయి. నిబంధనలు పాటించని వాహనదారులపై తీసుకుంటున్న చర్యలపై షాద్‌నగర్ ఎంవీఐ ఇ.వాసుతో 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్..

**రోడ్డు రవాణా శాఖలో వస్తున్న మార్పులేమిటి?**

జాతీయ స్థాయిలో ఎక్కడి నుంచైనా సమాచారం పొందడానికి సారథి అనే యాప్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ యాప్‌లో లభించే సమాచారంతో దేశంలో ఎక్కడైనా లైసెన్స్‌లో మార్పులు చేయించుకునే అవకాశం కల్పిస్తున్నారు.

**వాహనాల ఫిట్‌నెస్, పన్నులు, చలాన్ల చెల్లింపులెలా ఉన్నాయి?**

వాహనదారుల్లో చైతన్యం వచ్చింది. పన్నులు, చాలాన్లు చెల్లించి, ఫిట్‌నెస్ చేయించుకుంటున్నారు. లేనియెడల వాహనాలను సీజ్ చేస్తున్నాం. వాహనదారులు సకాలంలో చేయించుకుంటే ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బంది ఉండదు.

**ప్రతీ వాహనానికి హైసెక్యూరిటీ నెంబర్‌ప్లేట్ ఉండాలా?**

హైసెక్యూరిటీ నెంబర్‌ప్లేట్ల ఏర్పాటుకు ఎలాంటి గడువు లేదు. వాహనదారులకు ఆందోళన అవసరం లేదు. ప్రభుత్వ పరిశీలనలోనే ఉంది.

**ఫిట్‌నెస్ గడువుదాటిన వాహనాల పరిస్థితి ఏమిటి?**

ట్రాన్స్‌పోర్టు వాహనాలకు ఎనిమిది సంవత్సరాల వరకు ప్రతీ రెండు సంవత్సరాలకు, ఆ తరువాత ప్రతీయేటా ఫిట్‌నెస్ చేయించాలి. బస్సులకు ప్రతీయేటా, ఇతర వాహనాలకు 15 సంవత్సరాల వరకు ఫిట్‌నెస్ ఇస్తాం. ఆ తరువాత అవసరమనుకుంటే ఫిట్‌నెస్ చేయించుకోవాలి.

**ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలపై తీసుకుంటున్న చర్యలేమిటి?**

ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు జరిమానా విధిస్తున్నాం. ఈక్రమంలో జరిగే ప్రమాదాలు, నష్టాలపై జీపులు, ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనలు పట్టించుకోని ఓవర్‌లోడ్ ప్యాసింజర్ వాహనాలపై చర్యలు తీసుకుంటున్నాం. అందరూ నిబంధనలు పాటించాల్సిందే.

**వాహనదారులకు మీరిచ్చే సూచనలేమిటి?**

ప్రతీ వాహనదారుడు విధిగా వాహన ఫిట్‌నెస్‌ను చూసుకోవాలి. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, పొల్యూషన్, ఇన్సూరెన్స్ కాపీలు కలిగిఉండాలి. మద్యం తీసుకోకుండా, వేగ పరిమితికి లోబడి వాహనాలు నడపాలి. హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు.

(ఐదో పేజీ తరువాయి)

# పరిషత్ సమరం



పరిశీలించి పరిష్కరిస్తారు. 15వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు విధించారు. అనంతరం అంటే మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తారు. తొలివిడతకు సంబంధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు 23వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తారు. తొలివిడత జరిగే ప్రాదేశిక ఎన్నికల్లో 3,68,093 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొదటి దశ పోలింగ్ నిర్వహణకు మొత్తం 657 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే మొత్తం 3733 మంది సిబ్బందిని నియమించారు.

### తొలి విడత పరిషత్ సమరం ఇక్కడే...

తొలి విడత అంటే అక్టోబరు 23వ తేదీన చేవెళ్ల, కందుకూరు, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 10 జెడ్పీటీసీ, 110 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి, కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్, తలకొండపల్లి, శంషాబాద్ జెడ్పీటీసీ స్థానాలతో పాటు వీటి పరిధిలోని ఎంపీటీసీ స్థానాలకు నేటి నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు.

### నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో తొలివిడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నేడు నోటిఫికేషన్ విడుదల కానుండడంతో నామినేషన్లు స్వీకరించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే అధికార యంత్రాంగం ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్‌కు అవసరమైన మిగతా సామగ్రిని సమకూర్చుకుంది. ఎన్నికలు నిర్వహించేందుకు స్టేజ్-1, స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు, ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గురువారం తొలి విడత ప్రాదేశిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీచేసి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

### పకడ్బందీగా.. ప్రశాంతంగా..

పరిషత్ ఎన్నికలను పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆర్డీఓలు, ఎంపీడీఓలు ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల కాగానే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. అదేవిధంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని ఆదేశించారు.

## బెల్ట్‌షాప్ నిర్వాహకుల బైండోవర్

క్రైం కార్నర్

ఆదిబట్ల/యాచారం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని వివిధ గ్రామాల్లో 37 మంది బెల్ట్‌షాప్ నిర్వాహకులను బుధవారం ఎమ్మార్వో అయ్యప్ప ఎదుట బైండోవర్ చేశామని సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపారు. మాల్ నుంచి 8 మందిని, తక్కళ్లపల్లిలో 6, చిన్నతుండ్లలో 8, కొత్తపల్లిలో 8, నందివనపర్తిలో 5, గునగల్‌లో ఇద్దరిని బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ చేశాక బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

## సీజేఐపై దాడి అమానుషం

షాద్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి అమానుషమని, బాధ్యుడైన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన కూడలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకుడు, జర్నలిస్టు మిద్దెల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని చీకట్లోకి నెట్టేందుకు కొందరు మనువాదులు మతతత్వం పేరుతో దాడులు జరుపుతున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజాతంత్రవాదులు, మేధావులు ఖండించాలన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# జనాదరణ ఉన్నవారికే అవకాశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జనాదరణ కలిగి, ప్రజల మధ్య ఉండే నాయకులకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తొలి ప్రాధాన్యం ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రిజర్వేషన్ల కారణంగా స్థానిక ఎన్నికల్లో అవకాశం రాని నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సూదని రాంరెడ్డి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ కిసాన్ సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, భట్టు కిషన్‌రెడ్డి, నాయకులు రంగారెడ్డి, మిట్టపల్లి అంజయ్య, అజీమ్, యాదయ్యగౌడ్, భగవాన్ రెడ్డి, రవీందర్ యాదవ్, బొజ్జ సాయిరెడ్డి, పాండు గౌడ్, కానుగుల దశరథం, గుజ్జల మహేశ్, సూదిని కొండల్ రెడ్డి, యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, శ్రీనివాస మూర్తి, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, జెల్ల రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మధుసూదన్‌రెడ్డితో నాయకులు

షాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. షాబాద్ మండలంలోని పెదవేడు, లింగారెడ్డిగూడ గ్రామాల మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులు నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులు అందిస్తుందని ఆయన అన్నట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

## బాధితులకు సబితారెడ్డి పరామర్శ

కందుకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నోజిగూడ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం ఎన్‌టీఆర్ తండాలో ప్రమాదాలకు గురైన బాధితులను మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ సుశీల, ఆమె భర్త లక్ష్మణ్ నాయక్ బైక్‌పై వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఇద్దరికీ తీవ్రగాయాలై ఆస్పత్రిలో చేరి చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన రమావత్ రాహుల్ రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగి చికిత్స పొందాడు. బుధవారం సాయంత్రం సబితారెడ్డి వారిని పరామర్శించారు. రాహుల్‌కు పింఛన్ మంజూరుకు కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. టీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, జయేందర్ ముదిరాజ్, రామకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యేతో ఉన్నారు.



లక్ష్మణ్ నాయక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

# అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీసీలకు 42శాతం సీట్లు ప్రకటించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పల వెంకటేశ్

ఆమనగల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో 42 శాతం బీసీలకు సీట్లు ఇస్తామని ప్రకటించాలని మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉప్పల వెంకటేశ్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చట్టబద్ధత లేని 42 శాతం రిజర్వేషన్ల పేరుతో మరో మారు బీసీలను మోసగించడానికి కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుందని ఆయన ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యనాయక్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 42 శాతం అసెంబ్లీ సీట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి తీర్మానించి ప్రకటించాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలుపై ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలు ఎండగట్టే సమయం ఆసన్నమైందన్నారు. అన్ని వర్గాల ప్రజలను వంచనకు గురిచేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వెంకటేశ్ కోరారు. కోర్టులో తీర్పు ఎలా వచ్చినా ప్రస్తుతం ప్రకటించిన విధంగానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజాగ్రహానికి కాంగ్రెస్ గురికాక తప్పదని హెచ్చరించారు. తలకొండపల్లి, ఆమనగల్లు, మాడ్గుల మండలాల పరిధిలో తమ స్వప్రయోజనాల కోసం కాంగ్రెస్ అగ్రనేతలు ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చి పేద రైతుల ఉసురు తీస్తున్నారని వెంకటేశ్ మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్, భీమయ్య, గండికోట శంకర్, దోనాదుల కుమార్, సయ్యద్ ఖలీల్, గణేశ్, రఘు, ప్రసాద్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### 'జెడ్పీటీసీ'గా పోటీకి 'ఎస్సీ మాదిగ'కు అవకాశమివ్వాలి



మాట్లాడుతున్న నర్సింలు

చేవెళ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో చేవెళ్ల మండలానికి సంబంధించి జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి వారికి వ్యక్తికి టికెట్ ఇచ్చి న్యాయం చేయాలని సీనియర్ న్యాయవాది, ఆలూర్ మాజీ ఉపసర్పంచ్ మొకరం నర్సింలు అన్ని రాజకీయ పార్టీలను కోరారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్ల మండలం ఎస్సీ జనరల్‌కు రిజర్వు కావడం సంతోషకరమన్నారు. ఈ ఎన్నికల్లో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి వారికి జెడ్పీటీసీగా పోటీకి అవకాశమివ్వాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులను కోరుతున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ తనకు అవకాశమివ్వాలని కోరుతున్నట్లు ఈ సందర్భంగా కోరారు. అదేవిధంగా చేవెళ్ల మండలంలో ఎంపీపీకి సంబంధించి ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం కల్పించాలని ఆయన అన్నారు.

(ఐదో పేజీ తరువాయి)

# ఇంకెన్నాళ్లు..?

కూరగాయలు, మాంసం, చికెన్, పండ్లు కొనుగోలు చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. మార్కెట్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో చిరు వ్యాపారులు రోడ్ల పక్కన విక్రయాలు జరుపుతున్నారు. దీంతో వర్షాకాలంలో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదిభట్లలో ప్రైవేటు హాస్టళ్లు ఎక్కువగా ఉండడంతో కూరగాయలకు, మాంసం, చికెన్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. మార్కెట్ అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు రహదారులకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయాలు జరుపుతున్నారు. ఇలా రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు కొనసాగుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే మాంసాహారాలు, ఇతర ఆహార పదార్థాలపై దుమ్ముధూళి వచ్చి చేరుతుంది. తద్వారా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇది ఇలా ఉండగా నెల రోజుల క్రితం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ స్పెషల్ ఆఫీసర్ హోదాలో మున్సిపల్‌కు వచ్చిన సందర్భంగా సమీకృత మార్కెట్ గురించి ఆరా తీశారు. నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు నిధులు కేటాయించి మార్కెట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించి, అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**నిర్మాణం పూర్తి చేయాలి**



సమీకృత మార్కెట్ నిర్మాణం పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ఆదిభట్ల చౌరస్తా, టీసీఎస్ మరియమ్మ కాలనీలో రోడ్లపై కూరగాయలు అమ్మడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తే సమీకృత మార్కెట్‌లో ప్రజలకు కావాల్సిన కూరగాయలు, మాంసం లభిస్తాయి. ఇటు వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి.

- కోరే జంగయ్య, ఆదిభట్ల మాజీ ఎంపీటీసీ

## ఎన్నికలను సజావుగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, సజావుగా నిర్వహించాలని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. ఈమేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అనుమతిలేని ఫ్లెక్సీలు, కటౌట్‌లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్, తహసీల్దార్ సురేందర్, సీఐలు శ్రీనివాస్‌గౌడ్, వీరబాబు, ఎంపీవో గిరిరాజ్, ఏఈపీఆర్ నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

చౌదరిగూడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ప్రజలు, అధికారులందరూ సహకరించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎలాంటి తప్పులు చేయకుండా విధులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించుకోవాలని అన్నారు. అలాగే గ్రామాల్లో నర్సరీలో పెంచే మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యదర్శులు సౌజన్య, అనూష, పాండురంగం, రవీందర్, రాములు, సత్యనారాయణరెడ్డి, షఫీ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## సుమిత్రబాయి మృతి పట్ల నాయకుల సంతాపం



సుమిత్రబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ

ఆమనగల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ మాతృమూర్తి ఠాకూర్ సుమిత్రబాయి మృతిపట్ల పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలు సంతాపం తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో బుధవారం బాలాజీసింగ్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుమిత్రబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. నెలరోజుల వ్యవధిలో రతన్‌సింగ్, సుమిత్రబాయి మృతిపట్ల వారు విచారం వ్యక్తంచేశారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కడ్తాల కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు జవహర్‌లాల్ నాయక్, తులసీరామ్‌నాయక్, హీరాసింగ్, బబ్లు, తదితరులు ఉన్నారు.

# పులిమామిడిలో సమస్యలు పరిష్కరించాలి



కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కందుకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిమామిడిలో ఉన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలంటూ ఆ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పంచాయతీ కార్యదర్శి రాజేష్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆ సంఘం అధ్యక్షుడు సాయికుమార్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం ఇచ్చిన అనంతరం వారు మాట్లాడారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 20 రోజుల క్రితం అండర్ డ్రైనేజీ, మురుగునీటి కాల్వను జేసీబీతో గుంతలు తీయడం జరిగిందన్నారు. అనంతరం వాటిని పూడ్చకపోవడంతో రోడ్డుపై గోతులు పడి రాత్రి వేళల్లో వాహనదారులు గాయాలపాలైనట్లు తెలిపారు. అలాగే విద్యుత్ లైట్లు లేకపోవడంతో కాలనీవాసులు నానా అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు కార్తీక్, పి.రవి, వినవీన్ కుమార్, వి.రాజశేఖర్, అరుణ్, శివ, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

చేవెళ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించి వాహనాల్లో డబ్బులు తరలిస్తే సీజ్ చేస్తామని చేవెళ్ల ఎస్సై వనం శిరీష ఈ సందర్భంగా తెలిపారు. బుధవారం సాయంత్రం చేవెళ్ల పట్టణ కేంద్రంలో హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై వాహనాలను పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. స్థానిక సంస్థలు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్సై కోరారు. తనిఖీల్లో ఏఎస్సై బుగ్గయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



చేవెళ్ల పట్టణ కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

### చేవెళ్ల మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మహ్మద్ రియాజ్



చేవెళ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జిల్లా మార్కెట్ శాఖ ఏడీ మహ్మద్ రియాజ్ నియమితులయ్యారు. బుధవారం ఆయన చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రియాజ్ సూచించారు.

## టీచర్లను నియమించండి

మహేశ్వరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్(బాలికలు)లో విద్యాబోధనకు సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థినులు విద్యనభ్యసించలేక పోతున్నారని, వెంటనే టీచర్లను నియమించాలని ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి రాజేశ్ అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో టీచర్ల కొరతపై బుధవారం మండల విద్యాధికారికి వినత ఇపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రణీత్, ఆదిత్య తదితరులు ఉన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు